క్లుప్తంగా

కోదండరామ్‌కు శుభాకాంక్షలు


పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

ఇల్లెందు: ఎమ్మెల్సీగా ఎన్నికైన ప్రొఫెసర్ కోదండరామ్‌ను తుడుందెబ్బ నేతలు హైదరాబాద్‌లో సోమవారం ఆయన స్వగృహంలో కలిసి శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఆలెం కోటి, ప్రధాన కార్యదర్శి గొగ్గెల రామస్వామి, తాటి మధు ఆయనను కలిసిన వారిలో ఉన్నారు. అనంతరం గిరిజన సమస్యలపై చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఓ మేధావికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వటంతో ఆ పదవికి వన్నె వచ్చిందన్నారు.

కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నర్సింహారావు


నియామకపత్రం అందుకుంటున్న నర్సింహారావు

జూలూరుపాడు: కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పాపకొల్లు గ్రామానికి చెందిన అరిగెల నర్సింహారావు నియమితులయ్యారు. సోమవారం ఆయనకు జిల్లా అధ్యక్షుడు అల్లాడి నర్సింహారావు కాకర్ల గ్రామంలో నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్, బానోత్ నవీన్ రాథోడ్, మిర్యాల కిరణ్‌కుమార్, కంపసాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, అరిగెల నర్సింహారావును జూలూరుపాడులోని కాంగ్రెస్ కార్యాలయంలో పలువురు సన్మానించారు. కార్యక్రమంలో దుద్దుకూరి మధుసూదన్‌రావు, వేల్పుల నర్సింహారావు, నర్వనేని పుల్లారావు, మాచినేని సత్యనారాయణ, పోతురాజు నాగరాజు, కోటా కుమార్‌బాబు, గుంటక నరసింహారావు, నరసింహారావు, సమీర్ పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

ఇల్లెందు: తెలంగాణ మైనార్టీ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లను సద్వినియోగం చేసుకోవాలని డీఎస్పీ రమణమూర్తి కోరారు. ఈ మేరకు సోమవారం కళాశాలలో కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ ముద్దసిర్ హుస్సేన్ మాట్లాడుతూ.. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ రెండు గ్రూపులు ఉన్నాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు అర్హులని తెలిపారు.

'శ్రీచైతన్య' విద్యార్థుల ప్రతిభ


సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధిలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్‌లో ఒలింపియాడ్ స్థాయిలో ప్రతిభ కనబరిచారు. సోమవారం వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ.. కేఏటీ పరీక్షల్లో ఉత్తీర్ణులు అవడం అంటే ఐఐటీ ఫౌండేషన్‌కు పునాది వేసుకున్నట్లేనని చెప్పారు. నాణ్యమైన విద్యను అందించడంలో మేనేజ్‌మెంట్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ప్రతిభ కనబరిచిన 30మంది విద్యార్థులకు రివార్డులు ఇవ్వడం జరిగిందన్నారు.

అల్పాహారం అందజేత


అల్పాహారం అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: దానాలన్నింటిలో కెల్లా విద్యాదానం మిన్న.. అని జమాతే ఇస్లామీ హింద్ సభ్యులు షేక్ అబ్దుల్ బాసిత్ అన్నారు. సోమవారం స్థానిక బూడిదగడ్డ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల్లో నెల రోజుల పాటు అల్పాహారం అందించే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చదువు సంస్కారం నేర్పుతుందని, మంచిచెడుల విచక్షణ తెలియజేస్తుందన్నారు. దేవుడు మనకు ఇచ్చిన దానిలో కొంత మన చుట్టూ ఉన్నవారి అవసరాలను తీర్చే ప్రయత్నం చేయాలని చెప్పారు. హెచ్‌ఎం మధురవాణి, గౌరు భరత్, కాంతి రేఖ, గౌరు సాన్వీ, కౌలినీ, టీచర్లు దస్తగిరి, తారచంద్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఇంకో నెల పొడిగింపు

- వచ్చే నెలాఖరు వరకు ఈ-కేవైసీ
- రేషన్ లబ్ధిదారులకు మరో అవకాశం ఇచ్చిన ప్రభుత్వం
- 'గూడెం' నియోజకవర్గంలో 70శాతమే పూర్తి


మాలబంజరలో ఈ-కేవైసీ చేస్తున్న డీలర్

సుజాతనగర్: ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలకు తక్కువ ధరలకు పలు రకాల నిత్యావసర సరుకులను రేషన్ దుకాణాల ద్వారా అందజేస్తోంది. దీంతో పూర్తి రాయితీతో రేషన్ కార్డులో పేరు ఉన్న ప్రతీ ఒక్కరికి 6 కిలోల చొప్పున రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఈ బియ్యం పక్కదారి పట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రేషన్ కార్డులు ఉన్నవారు ఈ-కేవైసీ చేసుకోవాలనే ఆదేశాలు జారీ చేయడంతో నియోజకవర్గ వ్యాప్తంగా రేషన్ దుకాణాల్లో వేలిముద్రలు వేసే కార్యక్రమం సాగుతోంది. ఐదు నెలలుగా ఈ కార్యక్రమం సాగుతున్నా.. నియోజకవర్గంలో ఇంకా 30 శాతం మంది లబ్ధిదారులు ఈ-కేవైసీ చేయాల్సి ఉండగా వారికి భారీ ఊరట లభించింది. ఈ విషయంలో కేంద్రప్రభుత్వం వచ్చే నెల చివరి వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది.

తొలుత 31 వరకు గడువు...

రేషన్ లబ్ధిదారుల పారదర్శకత కోసం ప్రభుత్వం ఈ-కేవైసీ (నో యువర్ కస్టమర్)ను ప్రవేశపెట్టింది. ఈ ప్రక్రియ పూర్తి చేసుకునేందుకు ప్రభుత్వం తొలుత జనవరి 31 వరకు గడువు విధించింది. కార్డులో పేరున్న వారందరూ తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని అధికారులు చెబుతున్నారు. దీని ద్వారా బోగస్ కార్డులు, చనిపోయిన వారి పేర్లు తొలగిపోయే అవకాశం ఉంటుందంటున్నారు. ఈ ప్రక్రియ ద్వారా అసలు లబ్ధిదారులకు మేలు జరుగుతుంది. ఈ-కేవైసీ ఇతర చోట్ల చేసే అవకాశం లేదు. తప్పనిసరిగా రేషన్ దుకాణాలకు వెళ్లి వేలిముద్రలు వేయాలి. అయితే జనవరి 31 వరకు ఉన్న గడువును మరో నెలరోజుల పాటు ప్రభుత్వం పొడిగించింది.

సెప్టెంబర్‌లో మందకొడిగా ప్రారంభమై..

ఈ - కేవైసీ వివరాలు (ఈనెల 26వరకు)			
మండలం	కార్డులు	లబ్ధిదారులు	శాతం
సుజాతనగర్	8,615	24,908	71.23
పాల్వంచ	28,346	80,915	72.31
చుంచుపల్లి	10,229	28,334	60.39
లక్ష్మీదేవిపల్లి	10,762	31,798	70.19
కొత్తగూడెం	19,239	54,114	66.91

రేషన్ కార్డులో పేరున్న లబ్ధిదారులందరూ రేషన్ దుకాణాలకు వెళ్లి ఈ-కేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం గత సెప్టెంబర్‌లో ఈ ప్రక్రియను ప్రారంభించింది. మొదట్లో లబ్ధిదారులు ఆసక్తి చూపించలేదు. జనవరి 31తో గడువు ముగుస్తుందని తెలియడంతో రేషన్ దుకాణాలకు పరుగులు పెట్టారు. పదేళ్ల వయసు చిన్నారులు, వృద్ధులు వేలిముద్రలు పడక ఇబ్బందులు పడుతున్నారు. వేలిముద్రలు పడని వృద్ధులు, దివ్యాంగులకు ఐరిష్ ద్వారా నమోదు చేస్తున్నారు. కొంతమందికి ఆధార్ కార్డు ప్రక్షాళన లేకపోవడంతో ఈ-కేవైసీ నమోదు కావడం లేదు. వేలిముద్రల అప్‌డేట్ కోసం ఆధార్ సెంటర్లకు పరుగులు పెడుతున్నారు. ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు ఈ-కేవైసీ ఎలా చేయించుకోవాలంటూ ఆందోళన చెందుతున్నారు. గడువు పెంచిన నేపథ్యంలో లబ్ధిదారులకు ఊరట కలగనుంది.

ముగ్గురి పేర్లే ఉన్నాయి..



మేము మొత్తం ఐదుగురు కుటుంబ సభ్యులం. రేషన్ కార్డులో ముగ్గురి పేర్లే ఉండటంతో ముగ్గురి వేలి ముద్రలు తీసుకున్నారు. ఇద్దరి పేర్లు లేకపోవడంతో వారి పేరున రేషన్ రావడం లేదు. వారి పేర్లను కూడా కార్డులో చేర్చాలి.

– బానోత్ సురేష్, మాలబంజర

వేలిముద్రలు తీసుకున్నారు..



మాది మాలబంజర గ్రామం. కుటుంబంలో ఇద్దరం ఉన్నాం. చాలాసార్లు రేషన్ దుకాణానికి వెళితే వేలిముద్రలు పడక ఇబ్బందులు పడ్డాను. ఆధార్ సెంటర్‌కు వెళ్లి ఆధార్ కార్డులో సవరణలు చేశాం. ఇంటికి వచ్చి ఇద్దరి వేలిముద్రలు తీసుకున్నారు.

– భూక్యా ఈరి, మాలబంజర

నమోదు చేసుకోవాలి..



రేషన్ కార్డులో పేరున్న ప్రతీఒక్కరు రేషన్ దుకాణాలకు వెళ్లి తమ వేలిముద్రలతో ఈ-కేవైసీ చేయించుకోవాలి. వేలిముద్రలు పడని వారి పేర్లు తొలగిస్తారనేది అపోహ మాత్రమే. ఈ సమస్య ఉన్నవారు ఆధార్ సెంటర్‌కు వెళ్లి అప్‌డేట్ చేసుకోవాలి.– జి.శిరీష, తహసీల్దార్, సుజాతనగర్

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయండి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఇల్లెందురూరల్: నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 3న నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం ప్రచార పోస్టర్లను మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భూక్యా శ్యామ్, ఇర్ప రాజేష్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానంతో విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా ఉంటుందని ఆరోపించారు.

అన్నివర్గాల విద్యార్థులకు విద్యతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించాలని, శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించాలని, కులమత రహిత అంతరాలను తొలగించి విద్యార్థులకు సామాజిక సాంస్కృతిక ఆర్థిక అంతరాలను లేకుండా నవ సమాజాన్ని సృష్టించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పవన్, సమత, పూజిత, నాగేశ్వరి, ప్రమీల, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల హాజరు శాతాన్ని పెంచాలి


మాట్లాడుతున్న సీడీపీఓ నిర్మల జ్యోతి

జూలూరుపాడు: పిల్లల హాజరు శాతాన్ని పెంచాలని ఐసీడీఎస్ చంద్రుగొండ ప్రాజెక్టు సీడీపీఓ సీహెచ్ నిర్మల జ్యోతి అన్నారు. సోమవారం జూలూరుపాడు సెక్టారు సమావేశం సాయిరాంతండా అంగన్‌వాడీ కేంద్రంలో జరిగింది. ఈ సమావేశానికి సీడీపీఓ నిర్మల జ్యోతి హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలను సమయానికి తెరిచి ఉంచాలని, రికార్డులు అప్‌డేట్‌గా ఉండాలన్నారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్నారు. బాల్య వివాహాలు, మహిళల హక్కులు, పోక్సో చట్టం, చైల్డ్‌లైన్ హెల్ప్ లైన్ -1098, ఉమేన్ హెల్ప్ లైన్-181పై టీచర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎం.లక్ష్మి, నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


కౌన్సిల్‌ను అడ్డుకోవడం సరికాదు..

టేకులపల్లి: భద్రాచలం పట్టణంలో సోమవారం జరగనున్న ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కౌన్సిల్‌ను పోలీసులు అడ్డుకోవడాన్ని అన్నివర్గాల ప్రజలు ఖండించాలని ఆ సంఘం జిల్లా కోశాధికారి జె.గణేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీడీఎస్‌యూ జిల్లా జనరల్ కౌన్సిల్‌ను భద్రాచలం పట్టణంలో నిర్వహిస్తున్నట్లు 15 రోజులుగా జిల్లా వ్యాప్తంగా ప్రచారం నిర్వహించడం జరిగిందని, ఎప్పుడూ స్పందించని ప్రభుత్వం నేడు అనుమతి నిరాకరిస్తూ కౌన్సిల్ సభను అడ్డుకోవడం సరైంది కాదన్నారు. విద్యారంగ సమస్యలన్నీ ఒక పక్కన పేరుకుపోయి ఉంటే విద్యార్థి సంఘ నాయకులను నోరు మెదపకుండా చేయడం ఎంతవరకు సమంజసం అని ఇలాంటి చర్యలను అన్నివర్గాల ప్రజలు ఖండించాలని కోరారు.

పీహెచ్‌సీలో సమ్మె నోటీసు

ఇల్లెందురూరల్: కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబీ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని రొంపేడు పీహెచ్‌సీలో వైద్యసిబ్బందితో కలసి సోమవారం సమ్మె నోటీసు అందజేశారు. మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో సమ్మె చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫాతిమా, జర్పుల అనిత తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి టాలెంట్ టెస్ట్


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

జూలూరుపాడు: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా), తెలంగాణ – ఎస్‌సీఈఆర్‌టీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్థానిక హైస్కూల్‌లో స్పెల్ విజార్డ్, డ్రామా మండల స్థాయి టాలెంట్ టెస్ట్ పోటీలు జరిగాయి. పాఠశాల స్థాయిలో 8, 9 తరగతుల విద్యార్థులకు జరిగిన టాలెంట్ టెస్టులో ప్రథమ స్థానం పొందిన వారికి మండల స్థాయి పోటీలు నిర్వహించారు. స్పెల్ విజార్డ్‌లో జూలూరుపాడు హైస్కూల్ విద్యార్థి ప్రథమ బహుమతి సాధించగా, డ్రామాలో కాకర్ల హైస్కూల్ విద్యార్థి ప్రథమ స్థానంలో నిలిచాడు. విజేతలకు నిర్వాహకులు బహుమతుల ప్రదానం చేశారు. అనంతరం ఎల్టా మండల కన్వీనర్ టి.సాల్మన్ రాజు, కోకన్వీనర్ ఎస్.గురుమూర్తి మాట్లాడుతూ... విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ పోటీలు దోహదపడతాయన్నారు. విజేతలను ఫిబ్రవరి 13న జిల్లా స్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, రవికుమార్, ఖాజామియా, సుమలత పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎస్పీ

కొత్తగూడెంటౌన్: రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సోమవారం గండుగులపల్లిలోని ఆయన నివాసంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ బి.రోహిత్‌రాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా శాంతిభద్రతల గురించి చర్చించారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ..


క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఎస్పీ

టేకులపల్లి: యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఇన్‌చార్జ్, టేకులపల్లి మండలానికి చెందిన ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యాన రూపొందించిన క్యాలెండర్లను ఎస్పీ రోహిత్‌రాజ్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవినీతిని ప్రశ్నించడంతో పాటు చట్టాలను సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెంకటాచారి, ముత్తు రావుల, చంటి, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో ప్రవచనాలు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణ పరిధి హేమచంద్రాపురంలోని శ్రీశ్రీశ్రీ కోదండ రామాలయంలో ఫిబ్రవరి 1 – మార్చి 1 వరకు భాగవత ప్రవచనములు నిర్వహించనున్నట్లు ప్రవచనకర్త లట్టి జగన్మోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున హిందు భగవత్ బంధువులందరూ కుటుంబ సమేతంగా మహామయి మాన్వితమైన శ్రీశ్రీశ్రీ కోదండ రామాలయం ప్రాంగణంలో జరుగనున్న భాగవత ప్రవచనములు విని భగవంతుని అనుగ్రహం పొందాలని, అధిక సంఖ్యలో భక్తులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జీపీ కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా గోపాల్‌రావు



జూలూరుపాడు: గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఇఫ్టూ అనుబంధం) రాష్ట్ర కార్యదర్శిగా జూలూరుపాడుకు చెందిన ఏదులాపురం గోపాల్‌రావు ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయన సోమవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభ జరిగినట్లు చెప్పారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ) రాష్ట్ర కార్యదర్శి కె.సూర్యం సమక్షంలో రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఇల్లెందుకు చెందిన భూక్యా లక్ష్మణ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైనట్లు చెప్పారు.

అభివృద్ధి పనులు పరిశీలన


మొక్కలు నాటుతున్న చైర్‌పర్సన్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి గాజులరాజం బస్తీలోని శ్రీపాండురంగ భజన మందిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి సోమవారం మొక్కలు నాటారు. భజన మందిరంలో పలు నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో చైర్‌పర్సన్ సందర్శించి మాట్లాడారు. సుందరంగా తయారవుతున్న ఆలయ ప్రాంగణంలో కనువిందు చేసే మొక్కలు సైతం ఉండాలన్నారు. ఇందుకోసం మున్సిపాలిటీ నుంచి వివిధ రకాల 150 మొక్కలు తెప్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రుక్మాంగదర్ బండారి, సత్యభామ, ఆలయ పూజారులు శ్రీ వేదుల శ్రీరామచంద్రమూర్తులు, శ్రీరంగా రమణాచార్యులు, ఓం ప్రకాష్ పండిట్, జగదీష్ పండిట్, మధు, శ్రీసాయి భక్త బృందం పాల్గొన్నారు.

చివరి సమావేశంలో మాటల తూటాలు


సమావేశంలో చర్చిస్తున్న సుభాష్‌నగర్ పంచాయతీ పాలకవర్గం సభ్యులు

ఇల్లెందురూరల్: ఐదేళ్లుగా నిధులు.. అభివృద్ధి పనుల పేరుతో నిత్యం ఆరోపణలు, వివాదాలు, పంచాయతీలకు కేంద్రబిందువుగా మారిన మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీలో చివరి సమావేశం కూడా గరంగరంగా ముగించారు. ఐదేళ్లలో తాము చేసిన అభివృద్ధి, చేసిన ఖర్చు, సమకూర్చిన సదుపాయాలపై చర్చించి ప్రజలకు వివరించేందుకు ఉపయోగించుకోవాల్సిన చివరి సమావేశాన్ని.. ఒకరిపై మరొకరు మాటల తూటాలు పేలుస్తూ పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. గతంలో మీ ఎమ్మెల్యే ఉన్న సమయంలో పనులన్నీ మీరే చేశారు.. ఇప్పుడు మా ఎమ్మెల్యే పదవిలో ఉన్నారు.. ఏ పనైనా మేమే చేస్తాం.. అని ఓ సభ్యుడు సమావేశంలో మాట్లాడుతుండగా.. తాము ఎంతో కష్టపడి పనులు మంజూరు చేయించుకున్నామని, దీనికోసం పెద్దమొత్తంలో నిధులు ఖర్చు చేశామని.. గతంలో పంచాయతీ పాలకవర్గం చేసిన తీర్మానం ప్రకారం మాత్రమే పనులు చేస్తామని బదులు చెప్పారు. ఇదంతా మండల స్థాయి అధికారి అయిన ఎంపీఓ చిరంజీవి కూడా చూస్తూ ఉండటం గమనార్హం. ఇలా రెండు వర్గాలుగా విడిపోయి సాగుతున్న పంచాయతీతో విసిగిపోయిన పాలకవర్గంలోని కొందరు సభ్యులు గతంలో చేసిన తీర్మానాన్ని అమలు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేయడంతో సమావేశాన్ని ముగించారు. సర్పంచ్ వల్లాల మంగమ్మ అధ్యక్షతన ఏర్పాటైన సమావేశంలో వార్డు సభ్యులు, కార్యదర్శి రజినీకాంత్ పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం..

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలో సోమవారం ఎంపీపీ సోనా అధ్యక్షతన రైతు వేదికలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు హాజరయ్యారు. మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసుకోవాలన్నారు. మండలంలోని బెల్ట్ షాప్‌లు బంద్ చేయాలని ఎంపీటీసీలు కొల్లుపద్మ, శిరిష, సర్పంచ్‌లు తాటి పద్మ, ఎదురుగడ్డ సర్పంచ్ బానోత్ కవి, చాతకొండ సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. ఎక్సైజ్ కానిస్టేబుల్ సమాధానం చెప్పబోతుండగా, ప్రజాప్రతినిధులు అడ్డుకున్నారు. వచ్చే సమావేశంలో సీఐ రావాలన్నారు. ఎంపీడీఓ రమేష్ మాట్లాడుతూ.. ఈనెల 31తో సర్పంచ్‌ల పదవీకాలం పూర్తవుతున్న కారణంగా, వచ్చేనెల 1 నుంచి ప్రతీ పంచాయతీకి ప్రత్యేక అధికారులను నియమించటం జరుగుతుందన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని విద్యుత్ సమస్య రాకుండా చూస్తానని ఏఈ రఘు తెలిపారు.

నిలిచిన నియామకాలను చేపట్టాలి

సింగరేణి(కొత్తగూడెం): సాధారణ ఎన్నికల్ కోడ్ /యూనియన్ ఎన్నికల నేపథ్యంలో నిలిపివేసిన కార్పొరేట్ మెడికల్ బోర్డ్ నియామక పత్రాలు, వివిధ ఎక్స్‌టర్నల్ నియామకపత్రాలు వెంటనే అందజేయాలని, నిలిచిన భర్తీలను వెంటనే భర్తీ చేయాలని సోమవారం ఐఆర్‌పీఎం వింగ్ అధికారికి ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో జరిగిన సాధారణ ఎన్నికలు అదేవిధంగా సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల జరిగిన క్రమంలో సుమారు నాలుగు మాసాలుగా సింగరేణి వ్యాప్తంగా ఎంతోమంది మెడికల్ బోర్డ్ అన్‌ఫిట్ అయిన సుమారు 600 మందికి నియామక పత్రాలు నిలిచిపోయినట్లు చెప్పారు.

వీటికోసం డిపెండెంట్ కార్మికులు ఎదురుచూస్తున్నారని, ఎన్నికల కోడ్ అయిపోయింది కాబట్టి డిపెండెంట్ ఉద్యోగాలు, ఎక్స్‌టర్నల్ ఉద్యోగాలు వెంటనే ఇవ్వాలని కోరారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చే ప్రమాదం ఉంది, కాబట్టి వెంటనే నిలిచిపోయిన నియామకాలను భర్తీ చేయాలని కోరారు.

జేఏసీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న సమ్మె


డీజీఎం పర్సనల్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ జేఏసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు జేఏసీ ఆధ్వర్యంలో కార్పొరేట్ డీజీఎంకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ... కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కార్మిక చట్టాల స్థానంలో తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రైతులకు నష్టం చేసే చట్టాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జరిగే పోరాటంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు ఐక్యంగా కదిలి రావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని విచ్ఛిన్నం చేసి కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను తిప్పికొట్టాలన్నారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు హైపర్ వేతనాలు చెల్లించాలని, జీఓ నంబర్ 22 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని, 2022లో జేఏసీ ఒప్పందంలోని పెండింగ్ అంశాలను తక్షణమే అమలు చేయాలని తదితర డిమాండ్ల సాధనకు ఫిబ్రవరి 16న జరిగే దేశావ్యాప్త ఒక్కరోజు సమ్మెలో సింగరేణిలోని అన్ని విభాగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంట్రాక్ట్ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగంపై నిర్లక్ష్యం వీడండి..


ధర్నా చేస్తున్న నాయకులు, విద్యార్థులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.పోలీసులు ధర్నా విరమింపజేసే ప్రయత్నంలో కొంతసేపు తోపులాట జరిగింది. తరువాత కలెక్టర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బుర్రా వీరభద్రం మాట్లాడారు. జిల్లాలో ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. పెండింగ్‌లోఉన్న రూ.7,800 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని కోరారు. మెస్, కాస్మోటిక్స్ చార్జీలు పెంచాలని, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యారంగంలో ఖాళీగా ఉన్న 26 వేల ఉపాధ్యాయ పోస్టులు, ఉపాధ్యాయేతర పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఉన్నతవిద్యలో టెక్నికల్ ఎడ్యుకేషన్ విద్యార్థులకు మూడు సంవత్సరాలుగా ట్యూషన్ ఫీజు, మెస్ ఫీజులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో అద్దె భవనాలలో నిర్వహిస్తున్న సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలను నిర్మించాలని కోరారు. ఇంటర్, పదో తరగతి విద్యార్థులకు స్పెషల్ మెనూ అందించాలన్నారు. జిల్లాలో నూతన ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ములకలపల్లి, సుజాతనగర్, కొత్తగూడెం మండలాలలో వసతిగృహాలు ఏర్పాటు చేయాలని విన్నవించారు.

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయడం తగదని, నూతన ప్రభుత్వం గత పాలకుల తప్పిదాలు చేయవద్దని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సంద్ర భూపేందర్, బయ్యా అభిమన్యు, కె.సందీప్, బి.అభిమిత్ర, జిల్లా సహాయ కార్యదర్శి మంద నాగకృష్ణ, జిల్లా నాయకులు యశ్వంత్, రామ్‌చరణ్, ప్రవీణ్, పవన్, చరణ్, భవాని, సుధీర్, సాగర్, నిఖిల్, ప్రణయ్, వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.